సీఐ, రూరల్ ఎస్ఐలను కలిసిన కూటమి నేతలు

విశాలాంధ్ర - యలమంచిలి: సీఐ, రూరల్ ఎస్ఐలుగా బాధ్యత స్వీకరించిన ఎస్.ధనుంజయ రావు, ఎం.ఉపేంద్రలను మండల ఎన్డీఏ కమిటీ నాయకులు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు అన్నం బాబూజీ నేతృత్వంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అందరు ప్రజల సహకారంతో శాంతి భద్రతలు 100% పరిరక్షించే విధంగా అందరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు కొల్లి సత్య నారాయణ, జనసేన మండల యువజన విభాగం చీఫ్ శానా నానాజీ, జనసేన నాయకులు కొండలరావు, మహాలక్ష్మి నాయుడు, అనపర్తి రాజు, సందీప్, బిజెపి నాయకులు ఎస్.శ్రీనివాసవులు పాల్గొన్నారు.

వైద్య ఒప్పంద కార్మికులపై వేధింపులు ఆపాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: జిల్లాలో వైద్య విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని కార్మికులపై వేధింపులు ఆపాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎన్టీఆర్ వైద్య విభాగ ఒప్పంద కార్మికుల సంఘం అధ్వర్యంలో కార్మికులు 14వ రోజు నల్ల బ్యాడ్జి ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. వేతనాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే... బిల్లులు రాలేదని, అందుకే ఇవ్వలేదని సాకులు చెబుతున్నారని పేర్కొన్నారు. దుర్భర పరిస్థితుల్లో వైద్య విభాగ ఒప్పంద కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణం ప్రభుత్వం స్పందించి ఒప్పంద కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, యూనిఫామ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మారిన తరుణంలో కొన్నిచోట్ల ఒప్పంద కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయని తెలిపారు. అలాగే 15తర్వాత ఉద్యమం ఉధృతం చేస్తున్నామని అందులో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య శాఖ అధికారి, జిల్లా కార్మిక శాఖ అధికారిలకు ప్రజా ప్రతినిధులకు సమ్మె నోటీసులు ఇచ్చి సమ్మెలోకి వెళుతున్నట్లు లక్ష్మణ తెలిపారు. కార్యక్రమంలో నూకరాజు, సంతోష్, కిరణ్, అడవి రాజు, రామ్ ప్రసాద్, వరలక్ష్మి, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

అవమానం భరించలేక వైసీపీని వదిలేసా: భవాని

విశాలాంధ్ర - కే.కోటపాడు: గత మూడున్నరేళ్లుగా తనను అవమానానికి గురిచేసి గ్రామ సచివాలయంలో కుర్చీ లేకుండా చేసిన వైసీపీ పార్టీ నాయకులను, ఆ పార్టీని ఏనాడో వదిలి వేశానని కే.కోటపాడు మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని ఆవేదన వెలిబుచ్చారు. ఆమెకు జరిగిన అవమానాన్ని స్థానిక విలేకరులకు తెలిపారు. రాజ్యాంగం ప్రకారం దళిత మహిళ అయిన తనకు గ్రామ సర్పంచ్‌గా అధికారం చేపట్టే అవకాశం వచ్చిందని, అయితే ఆనాడు అధికార మదంతో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ తనచే బలవంతంగా మెడికల్ లీవ్ పెట్టించారని అన్నారు. ఉప సర్పంచ్ అయిన ఎంపీపీ భార్య రెడ్డి అరుణను సర్పంచ్ సీట్లో కూర్చోబెట్టి పాలన సాగించాడని అన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అండ దండలతో తనను మానసికంగా వేధించి తన పదవిని అడగదొక్కాడని అన్నారు. ఎంపీపీ వ్యవహార శైలి నచ్చకపోవడం వల్లే ఆ పార్టీని వీడవలసి వచ్చిందన్నారు. తన ఇష్ట ప్రకారంగా టీడీపీ పార్టీలో చేరానని, తనపై ఎవరి బలవంతం లేదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆశీస్సులతో మాజీ సర్పంచ్ డోకల నరసింహమూర్తి ఇతర కూటమి నాయకులతో కలిసి ఇకపై గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

యువజనోత్సవ పోటీల్లో ప్రతిభ చూపిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువజన సంక్షేమ శాఖ, సెట్విజ్ అధ్వర్యంలో కాకినాడ నందు నిర్వహించిన జిల్లా యువజనోత్సవ పోటీలలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సైన్సు అండ్ టెక్నాలజీ విభాగంలో ఆవిష్కరణ నేపథ్య పోటీల నందు ప్రదర్శించిన హెర్బల్ సోప్, లిక్విడ్ సోప్, ఫినాయిల్ ప్రాజెక్ట్ నందు పి.నందిని, ఎస్.కే మదీనా బీబీ, టి శ్రీవల్లి, ఎం.ఉష, జి.లక్ష్మి జ్యోతి బృందం, జానపద గేయాలు సోలో నందు జి.సాయి శ్రీ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రధమ స్థానాన్ని కైవసం చేసుకోవడమే కాకుండా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జానపద గేయాలు గ్రూప్ నందు కె. సాత్విక, జి.సాయి శ్రీ, కె.సంధ్య, పి.ఆశ్రిత, కె.చంద్రిక, పి.లక్ష్మి అపర్ణ ద్వితీయ స్థానం, జానపద నృత్యం సోలో నందు టి.చరణ్ జ్యోతి నందు తృతీయ స్థానం సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

ప్రజా సంక్షేమానికి జగన్ కృషి: ఎంపీపీ గోవింద్

విశాలాంధ్ర - యలమంచిలి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసీపీ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని యలమంచిలి ఎంపీపీ గోవింద్ అన్నారు. శనివారం సోమలింగపాలెం గ్రామానికి చెందిన పిల్ల మెహర్ బాబాకు లక్ష రూపాయలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎసెన్షియా కంపెనీలో బాయిలర్ పేలి 17 మంది మృతి చెందగా 41 మందికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మృతుల కుటుంబాలకు ఐదు లక్షల చొప్పున, క్షతగాత్రులకు లక్ష రూపాయలు చొప్పున ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎంపీపీ ఎర్రయ్య దొర, యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఏ.గుప్తా, కౌన్సిలర్లు పిట్ట సత్తిబాబు, రాపేటి సంతోష్, దూది నరసింహమూర్తి, వైసీపీ నాయకులు కొల్లి త్రినాధరావు, పిల్ల అయ్యల గోవింద నాయుడు, పిల్ల సత్యనారాయణ, ఆర్ల వాసు, పిల్ల పర్సు నాయుడు, పోలమల శెట్టి రామారావు, మర్రి రాజబాబు, ఎడ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి కొలువుల్లో నిత్యాన్నదానం అభినందనీయం

విశాలాంధ్ర - చోడవరం: గణపతి నవరాత్రి కోలువుల్లో నిత్యాన్నదానం, ఆధ్యాత్మిక కార్యాలు దిగ్విజయంగా కొనసాగించడం ఎంతో అభినందనీయమని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. చోడవరం శివారు పి.ఎస్.పేట బ్రాహ్మణ వీధిలో వేంచేసిన శ్రీలక్ష్మి గణపతి స్వామిని శనివారం ఎమ్మెల్యే రాజు దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మి గణపతి దేవస్థానంలో నిర్వహించెడి 133వ నవరాత్రులు సందర్భంగా ఎనిమిదవ రోజు అయిన శనివారం ఉదయం లక్ష్మీ గణపతి హెూమం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు పండితులు ఆరవెల్లి వెంకట నరసింహాచార్యులు, గోవిందాచార్యులు, శేష సూర్య గోపాలచార్యులు తదితర వేద పండితులు ఆధ్వర్యంలో నిర్వహించారు. నవరాత్రులు సందర్భంగా ప్రతీ రోజూ లక్ష్మీ గణపతి హెూమం, ప్రత్యేక పూజలు, శనివారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్, శ్రీ గణేష్ ఉత్సవాలు గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు పుత్రేవు శ్యామ్ ప్రసాద్ తెలియజేసారు. నవరాత్రుల్లో లక్ష్మీ గణపతి దేవస్థానంలో ఎస్.ఎల్.జి. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ రోజూ భక్తులకు నిత్యాన్నదానంలో ఎమ్మెల్యే రాజు పాల్గొని, భక్తులతో సహపంక్తి భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఏ.పి.రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మళ్ళునాయుడు, మాజీ ఎం.పి.పి. జి.వి.సత్య నారాయణ (పెదబాబు), గూనూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - అనకాపల్లి: రాజీ మార్గం ద్వారా సమస్యలను పరిష్కరిం చుకునేందుకు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య పేర్కొన్నారు. కోర్టుల చుట్టూ తిరిగే పని ఉండదని సూచించారు. నేషనల్ లోక్ అదాలత్‌లో భాగంగా అనకాపల్లి కోర్టులో శనివారం అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ కక్షిదారులకు పలు సూచనలు చేశారు. అనవసరమైన గొడవలు పెంచుకొని బంధుత్వాలు పోగొట్టు కోవద్దన్నారు. కోర్టుల చుట్టూ తిరిగితే ఆర్థికంగా కూడా ఇబ్బందులు పడతారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కక్షిదారుల ప్రయోజనార్థం నిర్వహిస్తున్న లోక్ అదాలత్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ విజయలక్ష్మి, అధ్యక్షులు ఎం జె వి ఎస్ కుమార్, సెక్రెటరీ దుర్గారావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఒక ఫ్యామిలి కేసు లో మైంటెనెన్స్ కింద రూ.3 లక్షలు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ ఇప్పించారు. దీనికి కక్షిదారులు సంతోషం వ్యక్తపరిచారు.

వెండితెర వేల్పు జబర్దస్త్ అప్పారావు

విశాలాంధ్ర - కే.కోటపాడు: ప్రముఖ టీవీ రంగస్థలం నటుడు జబర్దస్త్ అప్పారావు (57) మండల కేంద్రంలోని వారి బంధువుల ఇంటికి శనివారం హాజరయ్యారు. 350 సినిమాలకు పైగా నటించడంతోపాటు 70 పైగా సీరియళ్ళలో 24 ఏళ్లుగా కళారంగానికి సేవలందిస్తున్నట్లు తెలిపారు. 1984 నుండి రంగస్థలం కళాకారుడిగా పౌరాణిక సాంఘిక నాటక కళాకారుడిగా బుర్రకథ జానపద గీతాలు కోరస్ మిమిక్రీ మొదలైన కళారూపాలను నిత్యం ప్రదర్శించేవాడినని అన్నారు. నాటక రంగానికి చెందిన మాదేటి వెంకట లక్ష్మణరావు, సినిమా రంగానికి చెందిన లంకా సత్యానందం మాస్టర్ తన తొలి గురువులని అప్పారావు తెలియజేశారు. తొలిసారిగా జబర్దస్త్ కార్యక్రమానికి భీమరశెట్టి చిన్ని కృష్ణ, షకలక శంకర్ గురువుగా తనకు ప్రవేశం కల్పించారని తెలిపారు. దివంగత రామోజీరావు నిర్మాతగా తీసిన శుభవేళ సినిమా తనకు తొలి చిత్రం అన్నారు. సరిలేరు నీకెవ్వరు, చందమామ, మహాత్మా, మినుగురులు, వీడు తేడా తదితర సినిమాలు తనకు ఎంతో పేరు ప్రఖ్యాతులను తీసుకువచ్చాయి అన్నారు పీలా మల్లికార్జునరావు అవార్డు పొట్టి ప్రసాద్ అవార్డు తోపాటు ఉత్తమ హాస్య నటుడి అవార్డు పొందినట్లు ఆయన తెలిపారు. విశాఖపట్నం అక్కయ్యపాలెం లో హైదరాబాదులో నివాసం ఉంటూ జబర్దస్త్ కళాకారుడిగా పనిచేస్తున్నట్లు, తనను ఆదరించిన ప్రేక్షకుల అందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు జబర్దస్త్ అప్పారావు తెలిపారు.

నక్కపల్లి ఏపీఐఐసీ స్థలాలకు ప్రత్యేక గ్రీవెన్స్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ స్థలాలకు సంబంధించి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీఐఐసీ స్థలాలకు సంబంధించి ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని, భూమిసేకరణలో నేటి వరకు నష్టపరిహారం అందని రైతులు వారి వద్ద ఉన్న పూర్తి డాక్యుమెంట్ ఆధారాలతో హాజరు కావాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోరారు. మంగళవారం ఉదయం 10-00 గంటల నుండి నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి, జెడ్.ఎమ్.,ఏపీఐఐసీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారి సిబ్బంది, నక్కపల్లి తహశీల్దార్, వారి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

16న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

విశాలాంధ్ర - అనకాపల్లి: ప్రతి సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈనెల 16 ప్రభుత్వ సెలవు రోజు దృష్ట్యా రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. 16న మిలాద్ ఉన్ నబీ ప్రభుత్వ సెలవు రోజు కారణంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేయడం జరిగిందని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ఎస్ఐగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - రావికమతం: కొత్తకోట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా ఎం.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన అనకాపల్లి కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించే వారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు కృషి చేస్తానన్నారు.

పశువుల పాకను తగలబెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని మంగవరం గ్రామంలో కురెళ్ళ అచ్చయ్య అనే రైతుకు చెందిన పంట భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు పశువుల పాకను తగలబెట్టారు. ఆసమయంలో పాకలో సుమారు రూ.70 వేలు విలువైన గేదె ఉంది. పాక పూర్తిగా కాలిపోగా, గేదె 80 శాతం పైగా కాలిపోయింది. రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ అప్పన్న స్థలాన్ని, గేదెను పరిశీలించారు.

వరద బాధితులకు చెట్టినాడ్ సిమెంట్ రూ.కోటి విరాళం

విశాలాంధ్ర - కశింకోట: వరద బాధితుల సహాయార్థం చెట్టినాడ్ సిమెంట్ యాజమాన్యం తమ వంతు సాయంగా సీఎం సహాయనిధికి కోటి రూపాయల చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సంస్థ సీఎండీ డాక్టర్ ముత్తయ్య రామస్వామి అందించడం జరిగిందని అసంస్థ ప్రతినిధులు ప్లాంట్ హెడ్ ప్రసాద్ బాబు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరసింహ రాజులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు ప్లాంట్ హెడ్ ప్రసాద్ బాబు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరసింహ రాజులు మాట్లాడుతూ ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయని, ఎన్నో కుటుంబాలు, ఎంతోమంది నిరాశ్రయులయ్యారని వారి సహాయార్థం తమ సంస్థ వంతుగా ఈ విరాళం సిఎండి ఇవ్వడం జరిగిందన్నారు.

ఏషియన్ పెయింట్స్ సౌజన్యంతో వంతెనకు కొత్త గేట్లు ఏర్పాటు

విశాలాంధ్ర-మునగపాక: మండల కేంద్రమైన మునగపాక సంతబయలు ఆవ కాలువపై వంతెనకు సక్రమమైన గేట్లు లేకపోవడం వల్ల సాగునీరు సక్రమంగా ప్రవహించటం లేదు. దీనివలన ముంపునకు గురైన పంట పొలాలలోని నీరు నిలవ ఉండిపోవడంతో పంట పాడైపోతుంది. ఈ విషయమై ఏషియన్ పెయింట్స్ కంపెనీ యాజమాన్యం వారికి తెలియజేస్తే వెంటనే తక్షణమే స్పందించి కొత్త గేట్లు పునరుద్ధరణలో భాగంగా శనివారం కొత్త గేట్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు, కూటమి నేతలు విల్లూరి నూక నరసింహారావు, గ్రామ శాఖ అధ్యక్షులు దాడి శివ, ఆడారి లక్ష్మణరావు ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సెజ్ ప్రమాదంలో గాయపడ్డ నాగభూషణం కుటుంబీకులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-మునగపాక: అచ్యుతాపురం సెజ్ కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో వాడ్రాపల్లి గ్రామానికి చెందిన మళ్ల నాగభూషణం కుటుంబీకులకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన లక్ష రూపాయలు చెక్కును శనివారం మళ్ల నాగభూషణం కుటుంబాలకు అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మునగపాక మండలం వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యులు మద్దాల వీరుడు నాయుడు, వాడ్రాపల్లి గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు,మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు,మాజీ పి.ఎ.సి.ఎస్ కోనపల్లి రామ్మోహన్రావు, దొడ్డి వరాహ సత్యనారాయణ,పెతకంశెట్టి రామజోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చౌడువాడలో మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - కే.కోటపాడు: మాజీ ఐఏఎస్ అధికారి దివంగత డాక్టర్ సంతానం జ్ఞాపకార్థంగా ఏర్పాటైన సాంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం చౌడువాడ పీహెచ్‌సీ ఆవరణలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలైన మల్లంపాలెం, పాచిలవానిపాలెం, గరుగుబిల్లి, గుల్లేపల్లి, గొండుపాలెం గ్రామాల నుండి సుమారు 600 మంది రోగులు హాజరయ్యారు. వీరందరికీ వివిధ రకాల పరీక్షలు నిర్వహించడమే కాకుండా వేలాది రూపాయలు ఖరీదు చేసే మందులను ఉచితంగా అందజేశారు. సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసన్, అనురాధ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో నిరుపేద విద్యా ర్థులకు లక్షలాది రూపాయలు వెచ్చించి పుస్తకాలు ఇతర సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. విద్య వైద్యానికి తమ ట్రస్టు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇతర కమిటీ సభ్యులు ఖాజా, శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, రవికిరణ్, సత్య, విజయ సహకారంతో అనేక పీహెచ్‌సీల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ రాజా, డాక్టర్ నిర్మల, డాక్టర్ తరణి, మైత్రి నేత్రాలయ వైద్యులు వైద్య సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు ఎంపీటీసీ సభ్యులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: సీపీఎం ఆలిండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో పాయకరావుపేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం సిపిఎం పార్టీకి, వామపక్ష ఉద్యమాలకు తీరని నష్టమని అన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీలు పేరు చెప్పగానే మొట్టమొదటిగా గుర్తు కు వచ్చేది సీతారాం ఏచూరి అన్నారు. ఏచూరి గొప్ప మేధావి, రచయిత, గొప్ప వక్త, గొప్ప మానవతావాది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీతారామమూర్తి, బి.నాగేశ్వరరావు, ఎం.రాజేష్, ఎన్.టి. సీతారామ మూర్తి, జి. తాళ్ళరావు, జి.వి.రమణ, వీర్రాజు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: వామపక్ష యోధుడు సిపిఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. పరవాడ సీటు కార్యాలయంలో గురువారం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ విద్యార్థి నేతగా మొదల్కె సిద్ధాంత వేత్తగా, వామపక్ష మేధావిగా అంచెలంచెలుగా ఎదిగి సీతా రాం ఏచూరి దేశ రాజకీయాలపై అత్యంత ప్రభావాన్ని కలిగించారని కొనియాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడు కొనేందుకు, దేశ రైతాంగ, కార్మిక ఉద్యోగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన సీతారాం ఏచూరి మహాయోధుడిని గనిశెట్టి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామలక్ష్మి, బి.లక్ష్మి, అరుణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: మండల కేంద్రంలోని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మృతికి సంతాపం తెలియజేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రొంగలి దేవుడు నాయుడు యూనియన్ నాయకులు జానకి మాట్లాడుతూ ఏచూరి కమ్యూనిస్టుల ఉద్యమంలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆయన మృతి దేశ ప్రజానికాన్ని పార్టీని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసినదన్నారు. విశాఖ జిల్లాలో ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజ్యసభలో లేవనెత్తడమే కాకుండా వాటిని ప్రభుత్వ రంగంలో కొనసాగించేందుకు విశేషమైన కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పి.రాజులమ్మ, బి.ఉమా, పి.చిన్నతల్లి, మీనా కుమారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి డెక్కన్ ఫైన్ కెమికల్స్ రూ.60 లక్షల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పాయకరావుపేట: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి మండలంలోని కేశవరం సమీపంలో ఉన్న డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం రూ.60 లక్షల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు చెక్కు రూపంలో అందజేశారు. రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో యాజమాన్యం తరపున కర్మాగారం డైరెక్టర్ కె.వి.ఎల్.పి.రాజు, ఉపాధ్యక్షులు ఎ.ఎస్.వీరారెడ్డి కలిసి చెక్కును విజయవాడ సీఎం క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కె.వి.ఎల్.పి.రాజు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా తరపున జిల్లా కలెక్టర్ సహాయ నిధికి ముందుగా రూ.10 లక్షలు అందజేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏర్పాటు చేసిన సహాయ నిధికి మరో రూ.50 లక్షలు హోం మంత్రి అనిత నాయకత్వంలో అందజేశామన్నారు.

మంగవరంలో పారిశుధ్యం అధ్వాన్నం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని మంగవరం గ్రామంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని గ్రామస్తులు ఆరోపి స్తున్నారు. పారిశుధ్యంపై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. వర్షాల వల్ల రోడ్లపై ఏర్పడిన మురికి వర్షాలు ఆగిపోయి నాలుగు రోజులు దాటిన శుభ్రం చేయించలేదని గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు కట్టా దొర ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఎస్సీ కాలనీలోని గ్రావెల్ రోడ్డు అంతా మురికి రోడ్డుగా మారిందని తెలిపారు. గ్రామంలో పారశుధ్యం సక్రమంగా ఉండేలా చూడాలని పంచాయతి అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పారిశుధ్యం సక్రమంగా లేని కారణంగా ప్రజలు మరింత అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని కట్టా దొర తెలిపారు. ఇప్పటికైనా గ్రామంలో పారిశుధ్యం సక్రమంగా అమలు జరిగేలా పంచాయితీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.